# రిజర్వాయర్ల నిర్మాణానికి త్వరగా భూసేకరణ పూర్తి చేయించాలి

**రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాని కలిసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే**

**ఇటిక్యాల సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గం లోని మల్లమ్మ కుంట గురించి. చిన్నోనిపల్లి రిజర్వాయల్ ల పై బుధవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా నీటిపారుదల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను ఏఐసీసీ కార్యదర్శి చత్తీష్ ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అలంపూర్ కలిసి రిజర్వాయర్ల నిర్మాణాలకు భూసేకరణ త్వరగా పూర్తి చేయించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ చరవాణిలో మాట్లాడడం జరిగింది శరవేగంగా పనులు చేపట్టాలని కలెక్టర్ ను ఆదేశించారు. త్వరగా భూసేకరణలు పూర్తి చేయాలని కోరారు. ఆయనతోపాటు మాజీ ఆర్ డి ఎస్ చైర్మన్ తనగల సీతారాం రెడ్డి, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డన్న, వైస్ చైర్మన్, పచ్చర్ల కుమార్ , గద్వాల జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాగరాజు, జగన్ గౌడు, యోగి రెడ్డి తదితరులు ఉన్నారు.



సచివాలయంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్


మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




ఆర్అండ్ఆర్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

# వెంకటాద్రి నిర్వాసితులకు.. అండగా ప్రభుత్వం

- ఆర్అండ్ఆర్ కాలనీలో మౌలిక వసతులకు చర్యలు
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

**బిజినపల్లి,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో సర్వం కోల్పోయిన వెంకటాద్రి ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. వెంకటాద్రి రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు వట్టెం గ్రామం వద్ద నిర్మించిన ఆర్అండ్ఆర్ కాలనీని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ నెల 2న కురిసిన భారీ వర్షాలకు మట్టిగుట్ట కూలడాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీవాసులు ఇటీవల భారీ వర్షాల వల్ల గుట్ట నుండి జారిపడుతున్న మట్టి దిబ్బల వల్ల ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగే ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు ఇతర పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్అండ్ఆర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులతో సమావేశం నిర్వహించి కాలనీలో సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. దేవాలయం, ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణాలను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుట్టనుండి మట్టి దిబ్బలు పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీ సమీపంలో నెలకొన్న భూ సమస్యలపై నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పూర్తి స్థాయిలో విచారణ చేసి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వెంకటాద్రి రిజర్వాయర్ ముంపులో కోల్పోయిన దేవాలయాల పరిహారాన్ని వెంటనే చెల్లించే విధంగా చూడాలని, కొత్తగా ఆర్అండ్ఆర్ కాలనీలో రూ. 75లక్షలతో దేవాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించేలా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు మాజీ సర్పంచ్ రమణి రామునాయక్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీరాములు పంచాయతీ సెక్రెటరీ పద్మ, కాలనీవాసులు తిరుపతినాయక్, పాండునాయక్ ఉన్నారు.

# ఆందోళన చెందొద్దు

- ప్రజలకు అందుబాటులో ఉంటాం..
- రెండ్రోజుల్లో తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పిస్తాం
- రెండు నెలల్లో పాఠశాల, అంగన్‌వాడి కేంద్రం ఏర్పాటు
- నిర్వాసితులందరూ ఆర్అండ్ఆర్ సెంటర్‌కు తరలాలి
- కలెక్టర్ బి.యం సంతోష్
- ఎమ్మెల్యే బండ్లతో కలిసి చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి గ్రామాల సందర్శన



చిన్నోనిపల్లి గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్,ఎమ్మెల్యే

**గద్వాల, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** నిర్వాసితులు అధైర్య పడొద్దని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ బి.యం సంతోష్ భరోసానిచ్చారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేం దుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు చేపడుతామన్నారు. ముంపునకు గురైన గట్టు మండలం,చిన్నోనిపల్లి గ్రామం, ధరూర్ మండలం నాగర్‌దొడ్డి గ్రామాలను కలెక్టర్ బి.యం సంతోష్, స్థానిక శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి సందర్శించారు. గతవారం రోజులుగా కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి గ్రామ ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముంపునకు గురైన 250 మందికి 16,500/- చొప్పున నష్టపరిహారం వారం రోజులలో అందే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. నిర్వాసితులందరూ ఆర్ఆర్ సెంటర్‌కు వెంటనే షిఫ్ట్ కావాలని సూచించారు. ఇట్టి పునరావస కేంద్రంలో పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని రెండు నెలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. రోడ్లు, తాగునీరు. విద్యుత్తు తదితర సదుపాయాలను రెండు రోజులలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పునరావాస కేంద్రంలో కలెక్టర్ ప్రత్యేక నిధుల నుండి డబ్బులు విడుదల చేసి అన్ని సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు. పునరావస కేంద్రంలో అందరికి భోజన సదు పాయాలు ఏర్పాటుతో పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించి అందరికీ మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న గృహాలను ఇంటింటికి తిరిగి కలెక్టర్ పరిశీలించారు. నాగర్ దొడ్డి గ్రామంలో ఆర్ ,ఆర్ సెంటర్ ను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టు కోసం గ్రామస్తులు త్యాగం చేయాల్సి ఉంటుందని,రాబోవు రోజులలో ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించి పాలమూరు జిల్లాలో వలసలు నివారించి ఇతర రాష్ట్రాల నుండి మన జిల్లాకు పనులకు వచ్చే విధంగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. చిన్నోనిపల్లి ప్రాజెక్టు పనులు గతంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిందని, ముంపుకు గురైన కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని వ్యవసాయంపై ఆధారపడిన ప్రతి ఒక్కరిఇని ప్రభుత్వం తరపున ఆదుకోవడం జరు గుతుందన్నారు. వచ్చే ఆరు నెలలలో రావలసిన అన్ని ఫలాలు, ఇండ్లు, షిఫ్టింగ్ చార్జీలతో పాటు ఆర్థిక సాయం ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆర్ఆర్ సెంటర్‌లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, ప్రజలు ఎవరు కూడా ఆందోళన చెందకూడదని,అధికారులందరూ ఎప్పటికప్పుడు



ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామచందర్,ఇరిగేషన్ ఈ ఈ రహీముద్దీన్, ఎలక్ట్రిసిటి ఎస్ ఈ భాస్కర్, మిషన్ భగీరథ ఈ ఈ శ్రీధర్ రెడ్డి, తహశీల్దార్ సరితారాణి,ఎంపీడీఓ చెన్నయ్య,మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విదేశాల్లో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకోం

- దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్న రాహుల్‌గాంధీ
- మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

4

# పరిశోధనలకు పెద్దపీట వేయాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో రసాయనశాస్త్రం విభాగాధిపతి డా. చంద్రకరణ్‌కు ఇండియన్ పేటెంట్ సాధించారు. 1బ్రోమో, 4 డై మిథైల్ పిరిడీనియం బ్రోమైడ్ 1 ఐయాడో 4 డై మీథైల్ పిరిడినియం ఐయాడైడ్ అనే నూతన రేయజెంట్స్ తయారు చేయడం ద్వారా పేటెంట్ హక్కు పొందారు. ఈ కొత్త పదార్థాలు ఔషధ పరిశ్రమలో పర్యావరణ అనుకూల మందుల తయారీలో ఉపయోగపడనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డా. చంద్రకిరణ్ మాట్లాడుతూ ఈ పదార్థాల వల్ల తక్కువ ఖర్చుతో నిర్దిష్ట సమయంలో అధిక దిగుబడితో సాధారణ ల్యాబ్‌లలో ఎన్నో ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనలో వాడే ఔషధాల తయారీ, వాటి చర్యాశీలత పెంచవచ్చునని, ఏకో ఫ్రెండ్లీ కారకాలు తయారీ చేయడం, గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాల అనుగుణంగా తయారీ ఇప్పుడు డ్రగ్ పరిశ్రమలలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, పరిశోధన రంగంలో యూనివర్సిటీ దినదినాభివృద్ధి చెందుతుందని, మన అందరికి గర్వకారణమని పేటెంట్స్ సాధించడం ద్వారా యూనివర్సిటీ నాక్ గుర్తింపులో ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. అధ్యాపకులు డా.నూర్జహాన్, డా. విజయలక్ష్మి, సుదర్శన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రామ్మోహన్, డా. అర్జున్‌కుమార్, డా.సిద్ధారామగౌడ్, పిఆర్‌ఓ డా. రవికుమార్ అభినందనలు తెలిపారు.



పేటెంట్ రైట్స్ సాధించిన డా. చంద్రకిరణ్, స్కాలర్ డా.స్వాతి



అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి

# అటవీ అధికారుల సేవలు మరువలేనివి

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- కలెక్టర్ విజయేంద్రబోయితో కలిసి అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** అటవీ సంపద పరిరక్షణ కోసం పని చేస్తూ అమరులైన అటవి అధికారులు, సిబ్బంది సేవలు మరువలేనివని, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్క రించుకుని బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అటవిశాఖ కార్యాలయంలో అటవి అమరవీరుల స్థూపం వద్ద స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పుష్పగుచ్చాల నుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అటవి సంరక్షణలో ప్రాణాలర్పించిన అటవీ అధికారులు, సిబ్బంది సేవలు మరువలేనివని అన్నారు. అటవి సంరక్షణలో ప్రాణాలు కోల్పోయిన వారి సేవలకు గుర్తు గానే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 11న అటవి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిం చుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 23 మంది అటవీ సంపద అయిన కలప, అక్రమ రవాణా జరగకుండా నిరోధించే క్రమంలో వారు ప్రాణాలు అర్పించారని, ప్రతి ఒక్కరూ చెట్లను రక్షించుకోవాలని, జిల్లాలో అటవిశాతం తక్కువ ఉందని, చెట్లను విరివిగా నాటాలన్నారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణలో ప్రాణాలో కోల్పోయిన అటవీశాఖ అధికారులు, సిబ్బందిని స్మృతిస్తూ అమరవీరుల స్తూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అడవులను అటవీ సంపదను సంరక్షించే క్రమంలో ప్రాణాలర్పించిన అటవీ అమరవీరులను స్మరిస్తూ, అటవి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలని, అడవులను నమ్ముకుని బతుకుతున్న చెంచులు, లంబాడ ఇతరుల జీవనోపాధికి ఎటువంటి భంగం కలగకుండా అడవులను సంరక్షించుకోవాలని అన్నారు. ముందు తరాల వారికి అడవులను కాపాడుకునేందుకు ప్రత్యేకించి విద్యార్థిని విద్యార్థులకు, యువతకు అర్థమయ్యేలా అటవిశాఖ తరపున ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ కట్టడాలను కూల్చివేయడం జరుగుతుందని, అలాగే అటవీ సంపద కాపాడుకునే విషయంలో ఎవరైన అడ్డువస్తే సహించేది లేదని హెచ్చరించారు. అడిషనల్ ఎస్పీ రాములు, జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి మందలించాడని ఎలుకల మందు తాగి విద్యార్థిని మృతి

మహ్మదాబాద్ మండలం దేశాయిపల్లిలో ఘటన 4



## ఆకట్టుకున్న గణనాథుడి ప్రతిమలు

దృశ్యమాలిక 4లో

**ఉమ్మడి జిల్లాలో వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆకారాల్లో, వివిధ రంగుల్లో ఏర్పాటు చేసిన గణేశుడి ప్రతిమలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, కోలాటాలు వేస్తూ, భజనలు చేస్తూ ఉత్సాహంగా ఉత్సవాలు జరుపుకొంటున్నారు.**

**- నెట్‌వర్క్, ఉమ్మడి జిల్లా**



జడ్చర్లలో రంగనాయకస్వామిగుట్ట ఆకారంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం



# కన్నతల్లి.. కర్కశత్వం

- పసికందు పాలిట శాపం..
- పుట్టిన కొన్ని గంటలకే రోడ్డుపక్కనే వదిలేసిన వైనం
- ప్రథమచికిత్స అనంతరం ఐసిడిఎస్‌కు తరలింపు

**దేవరకద్ర, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** కన్న తల్లి కర్కశత్వం ఆ పసికందు పాలిట శాపంగా మారింది. పుట్టిన కొన్ని గంటలకే ఆ పసికందు అనాథగా రోడ్డుపక్కనే పడింది. నవమాసాలు మోసి రక్తం పంచుకొని పుట్టిన బిడ్డను ఆ తల్లి కనికరం లేకుండా రోడ్డు పక్కన వదిలేసి పేగు బంధాన్ని వదిలించుకొన్నది. ఎలాంటి పరిస్థితుల్లో ఆ తల్లి ఇంతటి కఠిన నిర్ణయం తీసుకన్నదో అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరకద్ర మండలం డోకూర్ స్టేజి సమీపంలో బుధవారం గుండెలు పిండే ఈ సంఘటన చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. డోకూర్ స్టేజి సమీపంలో ఓ పసికందును ఎవరో రోడ్డు పక్కన వదిలిపెట్టి వెళ్లిపోయారు. పసికందుకు చీమలు కుట్టి ఏడుస్తుంటే ఆ శబ్దానికి అటు వైపు వెళ్తున్న కొంత మంది బాటసారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగన్న,అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి సహకారంతో పసికందును ముందుగా ప్రథమచికిత్స కోసం దేవరకద్ర ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అనంతరం మహబూబ్‌నగర్ ఐసిడిఎస్ అధికారులకు అప్పజెప్పారు.

# పాములొస్తున్నాయ్ సార్..

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు తెలిపిన విద్యార్థినులు
- కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ మండలంలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరును, ఉపాధ్యాయుల బోధన గూర్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి క్లాస్ రూమ్స్‌లోకి వెళ్లి విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కేజీబీవీలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ కోరారు. కేజీబీవీ పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వతో పిచ్చి మొక్కలు మొలవడంతో పాములు సంచరిస్తున్నాయని, విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ విద్యార్థినులతో కలిసి కేజీబీవీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అందుకు కావాల్సిన మరమ్మత్తుల చర్యలను అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. మరుగుదొడ్ల వినియోగానికి నీటి వసతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారిణి ఆదేశించారు. వంటగదిని కలెక్టర్ పరిశీలించి వంట మనుషులతో మాట్లాడారు. ఆహార పదార్థాలు అత్యంత పరిశుభ్రంగా వండాలని ఆదేశించారు. ఇటీవలే పెంట్లవెల్లి కేజీబీవీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వంట మనుషులను విధుల నుంచి తొలగించిన విషయాన్ని కలెక్టర్ వంట మనుషులకు సూచించారు. విద్యార్థులకు అందించే కూరగాయలు, బియ్యం, నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని ప్రత్యేకాధికారి శోభారాణి ఆదేశించారు. కేజీబీవీలో నెల కొన్న సమస్యలను ప్రత్యేకాధికారిణి శోభరాణి కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా అవసరమైన మౌలిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## కులాంతర వివాహ జంటలకు ప్రోత్సాహం అందజేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల టౌన్ ,సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:** కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకంగా మంజూరైన రూ. 3 లక్షల 50 వేల చెక్కులను బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా కులాంతర వివాహం చేసుకున్న జంటలకు ఆ చెక్కును అందజేశారు. చెక్కులు అందుకున్న వారు గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందిన కవిత కు అందజేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మనుషూలంతా ఒక్కటే అని దీనికి కులాలు అడ్డుగోడలుగా కావద్దని ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సహంతో ఉపాధి మార్గాలను ఎంచుకొని అభ్యున్నతి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రోత్సహక చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే

## వినాయక మండపాలకు ఆర్థిక సాయం

**కొత్తకోట సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి,బట్టి కుంట తాండ, ఈదుల బాయి తాండలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల మండపాలకు సంకిరెడ్డి పల్లి గ్రామ పెద్దలు అమర్ దొడ్డి విరాళం అందజేశారు. అమర్ రెడ్డి తల్లి వినాయక మండపాలను దర్శించి పూజలో పాల్గొన్నారు.అక్కడే తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాల దగ్గరికి వెళ్లి ప్రతి వినాయకునికి 5 వేల చొప్పున విరాళం అందజేశారు. మన గ్రామ ఆపద్బాంధవుడు అమర్ రెడ్డి తల్లి శ్రీలత రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయక మండపాల కమిటీ సభ్యులు వినాయకుని కోరుకున్నారు.అలాగే విగ్రహాల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యువకులు జాగ్రత్తగా ఉండాలని నిమజ్జనం కూడా శాంతి యుతంగా జరపాలని శ్రీలత రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు మస్తాఫా,మన్యం, యువకులు,పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


వినాయక మండపాలకు విరాళం అందజేస్తున్న శ్రీలత రెడ్డి

## సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలి

**బిజెపి పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి**

**మూడు గ్రామాలలో ముమ్మరంగా పార్టీ సభ్యత్వ నమోదు**


పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

**దేవరకద్ర,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** బిజెపి కార్యకర్తలు, నాయకులందరూ సమిష్టిగా పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వ నమోదు కార్య క్రమంలో పాల్గొనాలని ఆ పార్టీ పార్ల మెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కు మార్‌రెడ్డి సూచించారు. దేవరకద్ర మండలం చిన్న రాజమూర్, అడవి అజిలాపూర్, కోయిల్‌సాగర్ గ్రామాలలో బుధవారం ముమ్మరంగా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బిజెపితోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు. పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రజల కష్ట సుఖాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇంఛార్జి కొండ ప్రశాంత్‌రెడ్డితో పాటు దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, చిన్నచింతకుంట మండల పార్టీ అధ్యక్షుడు దశరథ, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యుడు దేవన్నసాగర్, పార్టీ సభ్యత్వ నమోదు ఇంఛార్జి నారాయణరెడ్డి, నాయకులు బాలాగౌడ్, అనిల్, నరేష్, కృపాకర్, ప్రవీణ్, వెంకటేష్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత: ఎమ్మెల్యే కూచుకుళ్ల

**తెల్కపల్లి,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపరిచే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చేరుకున్న వారు మండల సమావేశం హాల్లో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిందని త్వరలోనే రైతు భరోసా పథకాన్ని కూడా అమలు చేసిందన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. మిగతా 6 గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రజలు ఎవరు భయపడాల్సిన పనిలేదని అన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ ఛైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిపి బండ పర్వతాలు, బుచ్చిరెడ్డి, ప్రకాష్, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్, సంబంధిత అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## జంతు జనన నియంత్రణ అదనపు గది ప్రారంభం


జంతు జనన నియంత్రణ గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణంలోని మౌలాలిగుట్ట లక్ష్మీనగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, చిన్నపిల్లలు వృద్ధులు, మహిళలు కుక్క కాటుకు గురైన సంఘటనలు చాలా జరుగుతున్నాయని ఇకమీదట సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు మోతిలాల్, ఖాజాపాషా, తిరుమల వెంకటేష్, జాజిమొగ్గ నర్సింహులు, పాపారాయుడు, ఫ్యాషన్, ఇసామోది, ఉమర్, మునీర్, నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, బుద్దారం సుధాకర్‌రెడ్డి, ఇమ్మడి పురుషోత్తం, సాదుల్లా, మున్సిపల్ ఎఏస్ఓ సలీం, వార్డు ఆఫీసర్ సంధ్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలి

**ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి గంట కవితా దేవి**

**గద్వాల, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చే విధంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలను త్వరగా పరిష్కరింపచేస్తానని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి గంటా కవితాదేవి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి,లీగల్‌సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి గంటా కవితాదేవి సందర్శించారు. పాఠశాలలోని పరిస్థితులు బాగాలేవని తమ దృష్టికి రావడంతో పాఠశాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అన్ని తరగతి గదులను, వంటశాలను,పరిసర ప్రాంతాలను, విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిశీలించారు. పాఠశాలలో పాముల భయం,తాగునీరు,పారిశుద్ధ్య,మరుగుదొడ్లు, తరగతి గదుల కొరత, కిటికీలకు మెష్‌లు, పడుకోవడానికి వసతులు లేవని,తెలుగు,హిందీ, పి.ఇ.టి ఉపాధ్యాయులు ఎ.ఎన్.యం లేరని విద్యార్థులు తమ సమస్యలను న్యాయమూర్తికి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,పాఠశాలలో మౌలిక సదుపాయాల పరిస్థితులను బాగు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి,త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసకుంటామన్నారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో పాములు, ఇతర సమస్యలు ఎక్కువగా ఉండటంతో,తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, పాఠశాల వాతావరణ మెరుగుపరచడంలో అన్ని చర్యలూ,చేపట్టాలని,త్వరలోనే పాఠశాలకు సురక్షితమైన వాతావరణం కల్పిస్తామని విద్యార్థులకు భరోసా కల్పించారు.

విద్యార్థులు భయపడకుండా ఉన్నతంగా చదువుకోవాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శేషన్న,సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి గంటా కవితా దేవి


వంటశాలను పరిశీలిస్తున్న దృశ్యం

# నిమజ్జనానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

- ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలి
- నాగనూల్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:**జిల్లాలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధ వారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటిలోని నాగనూల్ చెరువును పోలీ స్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధి కారులతో మాట్లాడుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అపశృతులకు తావు లేకుండా ఆనందో త్సాల మధ్య భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. పట్టణాల్లో నిమజ్జన ఉత్సవం సాఫీగా నిర్వహిం చేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయకులను తీసుకొని రావ డానికి రోడ్డు సౌకర్యం మెరుగ్గా ఉండాలని, పలు చోట్ల ఉన్న చిన్నపాటి గుంతలను పూడ్చాలని పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శోభయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలె త్తకుండా రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిం చాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి బిగించాలని సూచించారు. నిమజ్జనం కోసం చెరువుల వద్దకు తరలివచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పోలీస్, ఫైర్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, పంచాయతీ రాజ్‌తో పాటు పలు శాఖలన్ని సమన్వయంతో పనిచేయాలన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జనోత్సవంలో ఏ చిన్న ప్రమాదానికి కూడా ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ భద్రతా చర్యల గురించి ఒక రూట్ మ్యాప్‌లను తయారు చేసి భద్రత చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. శోభయాత్ర కొనసాగే మార్గాల్లో సీసీ కెమెరా నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు.గతేడాదితో పోలిస్తే ఈ సారి అదనంగా వినాయక ప్రతిమలు ప్రతిష్టించడం జరిగిందని, ఇందుకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా వ్యవహరిస్తామన్నారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్‌బాబు, డీఎస్పీ శ్రీనివాసులు మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఎస్ఐ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.


నాగనూల్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్, ఆయా శాఖల అధికారులు

## జాతీయస్థాయి క్రీడల్లోనూ అద్భుతంగా రాణించాలి:ట్రైనీ కలెక్టర్

**మక్తల్,సెప్టెంబరు11 ప్రభాతవార్త:**పూర్తిగా గ్రామీణ ప్రాంతానికి చెందిన కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు జాతీయ స్థాయి రోడ్డు స్పీడ్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయస్థాయి క్రీడల్లోనూ విశేషంగా రాణించి కర్ని గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని నారాయణ పేట ట్రైనీ కలెక్టర్ గరీమ నురుల్లా ఆకాంక్షించారు. మక్తల్ మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు మల్లీశ్వరి, జైత్ర, హారికలు ఇటీవల జరిగిన రోడ్డు స్పీడ్ స్కేటింగ్ సౌత్‌జోన్ పోటీల్లో అసమాన క్రీడా ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా బుధవారం పాఠశాలకు వచ్చిన ట్రైనీ కలెక్టర్ గరిమా నురుల్లా ముగ్గురు బాలికలను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. మక్తల్ ప్రాంతం నుంచి క్రీడల్లో బాల బాలికలు విశేషంగా రాణిస్తున్నట్లు ఇక్కడి వాతావరణాన్ని చూస్తే స్పష్టంగా కనిపిస్తున్నదని ఆమె అన్నారు. బాల్యం నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ విశేషంగా రాణించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. నిరంతర సాధనకు పట్టు వదలని సంకల్పం తోడైతే జాతీయస్థాయి క్రీడాకారులుగా గుర్తింపు రావడం అసాధ్యం కాదని ఆమె అన్నారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ ఘని, జిల్లా క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, జిహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్, విశ్రాంత పీఈటి బి.గోపాలం, పిడి బి.రూప, ఉపాధ్యాయులు ఎల్లప్ప, నరేష్, మీరా, తిరుమల, మాజీ ఎంపిటిసి చిన్న రంగప్ప, మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఛైర్మన్ ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.


బాలికలను సన్మానిస్తున్న దృశ్యం

## భీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించాలి నేతల డిమాండ్

**ఆత్మకూర్ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** దేశ్యాప్తంగా కార్మికులకు ప్రమాదవశాత్తు చెల్లించాల్సిన భీమా సొమ్మును కేంద్ర ప్రభుత్వమే చెల్లించే విధంగా యధాస్థితిని కొనసాగించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ కార్యదర్శి పరుశరాముడు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రోజు కార్మికులకు భీమా సొమ్మును చెల్లించే విషయంపై జీవిత భీమా సంస్థకు టెండర్ల ద్వారా అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని తద్వారా కార్మికులకు చెల్లించాల్సిన భీమా సొమ్మును ఎగతవేత వేసేందుకు చర్యలు చేపట్టిందని నిరసిస్తూ ఆత్మకూరు పట్టణంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు కార్మికుల ప్రమాదవశాత్తు చనిపోతే ఆరు లక్షల మూప్పై వేల రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రసుత్తం ఎల్ఐసి సంస్థలకు టెండర్ల ద్వారా అప్పుజెప్పడం మూలంగా ఐదు లక్షలకు తగ్గించి భీమా సొమ్మును ఎగవేత వేసేందుకు ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా అసంఘటితరంగాల కార్మిక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు కూడా భీమా సొమ్మును చెల్లించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అసంఘటిత రంగ కార్మికులు శ్రమను యాజమాన్యాలు దోచుకుంటున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించి అటు లేబర్ అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు గాని ప్రమాద భీమా సొమ్మును కేంద్ర ప్రభుత్వమే చెల్లించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగానే సంతకాల సేకరణతో పాటుగా ఈనెల 23న చలో హైదరాబాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శివ,వెంకట్ రాములు, సత్తెన్న తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో సంతకాల సేకరణ చేస్తున్న కార్మిక సంఘ నేతలు

## ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పోస్టర్ విడుదల..

**గద్వాల, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** గద్వాల్ ఎల్ఐసి బ్రాంచ్ లో సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పోస్టర్ను గద్వాల బ్రాంచ్ ఎల్ఐసి ఉద్యోగులు బుధవారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ ఐసిఈయు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతి సంవత్సరం ఒకసారి హైదరాబాద్ అండ్ సికింద్రాబాద్ కంబైన్డ్ జనరల్ బాడీ కాన్ఫరెన్స్ జరుగుతుందన్నారు. ఈ బాడి కాన్ఫరెన్స్ సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రతి మూడు సంవత్సరములకు ఒకసారి జరుగుతుందన్నారు. ఇప్పుడు జరిగే ఈ కాన్ఫరెన్స్ 13వ కాన్ఫరెన్స్ బెంగూళూరులో జరుగుతుందని, అలాగే ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎఐఐఈఎ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జరుగునని వారు అన్నారు. ఈసారి జరిగే సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నవంబర్ 16 తారీక నుండి 19వ తారీక వరకు ఈ కాన్ఫరెన్స్ బెంగళూరులో జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ నాయకులు, సౌత్ సెంట్రల్ ఇన్సూరెన్స్ నాయకులు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నాయకులు, ఇతర నాయకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. కావున బెంగళూరులో జరిగే కాన్ఫరెన్స్ పోస్టర్ని మా గద్వాల బ్రాంచ్ లో విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సూరజ్, ఉద్యోగస్తులు పద్మావతి, చంద్రశేఖర్, నర్సింగ్, కిషోర్, మల్లికార్జున్ రాఘవేంద్ర, లక్ష్మీకాంత్, అమర్, సైలెస్, సుదర్శన్ లు పాల్గొన్నారు.


పోస్టర్ రిలీజ్ చేస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

## పదేళ్ల నుంచి ఒక్క రేషన్ కార్డు లేదు:ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**పెబ్బేరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే గత ప్రభుత్వం హాయంలో పదేళ్ల కాలంగా ఒక రేషన్ కార్డు కూడా జారీ చేయలేదని అభివృద్ధి అంటూనే అంత దోచేశారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు.బుధవారం పెబ్బేరు మండలం పరిధిలోని కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కురుణశ్రీ ,ఎమ్మార్వో ,ఎంపీడీఓ, కౌన్సిలర్లు ,పట్టణ కాంగ్రెస్ నాయకులు ,లబ్ధిదారులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

## సహాయ ఫౌండేషన్ జాతీయ అధ్యాత్మిక గౌరవ అధ్యక్షుడిగా శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి


స్వామికి నియామక పత్రం అందిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** సహాయ ఫౌండేషన్ జాతీయ అధ్యాత్మిక గౌరవ అధ్యక్షుడిగా శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిని నియమించడం జరిగిందని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టంకరిశివప్రసాద్ యాదవ్ తెలిపారు. అనంతరం మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామి ఉద్దేశ్యమైనటువంటి సత్యప్రయాణం,మోక్ష గమ్యం,ధర్మ మార్గాలు,వంటి సలహా సూచనలు సమాజానికి అందిస్తూ సన్మార్గంలో నడిపిస్తున్నాయని తెలిపారు. బిజ్వర్ గ్రామంలోని శ్రీ అంబత్రయ త్రిశక్తి పీఠాధిపతి అయనటువంటి శ్రీశ్రీశ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామిని శాలువాతో సత్కరించి నియామక పత్రం అందజేసారు.ఈ కార్యక్రమంలో సహాయఫౌండేషన్ సభ్యులు కుర్మయ్య,సునీల్,హన్మంత్‌రావు, కేశవ్,నాగరాజ్,దేవరాజు,అషియాన్‌రికార్డు హోల్డర్ డాక్టర్ బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శివలింగానికి తాకిన సూర్యకిరణాలు

**దేవరకద్ర,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** దేవరకద్రలో బుధవారం శివాలయంలో శివలింగానికి సూర్యకిరణాలు తాకాయి.ఇలా శివలింగానికి సూర్యకిరణాలు తాకడం చాలా అరుదు. దీంతో పుజారి నాగరాజు అధ్వర్యంలో శివలింగానికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## రూ.3660 ధర పలికిన కింటాల్ ఉల్లి

**దేవరకద్ర,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుదవారం రైతులు 7 కింటాళ్ళ ఉల్లిని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.3660 ధర పలికింది.అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## కబడ్డిలో ఏటీఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

**మహ్మదాబాద్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** సోమవారం నంచర్ల బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్జీఎఫ్ మండల స్థాయి కబడ్డి క్రీడా పోటీలలో ఏటిఆర్ పాఠశాల విద్యార్థులు రెండవ బహుమతి గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి,ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలని క్రీడలవల్ల శారీరక, మానసికఆరోగ్యం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పిఇటి అరుణ్, ఉపాధ్యాయ బృందం జయరాజ్,బాల్‌రాజ్, ఆంజనేయులు,మహేష్,నిర్మల,అనిత,లావణ్య, జ్యోతి, సభా, శ్రీలత, రాఘవేంద్రమ్మ, శివకుమార్, ఎజాస్, అన్వర్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర రాజధానిలో కోఠి మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరును పెడుతున్నట్లు ఖరారు చేయడంతో పాటు ఆమె మనువరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రకటించినందుకు బుధవారం కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కోఠిలోని మహిళా కళాశాలకు చాకలి ఐలమ్మ పేరును పెట్టడం చరిత్రలో నిలిచిపోతుందని, సీఎం రేవంత్‌రెడ్డి నిష్పక్షపాతంగా పాలన అందిస్తున్నారని వారుకొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లెల్ల రాములు, గోపాల్, దామోదర్‌గౌడ్, సంతుయాదవ్, హరిదాసు, నానియాదవ్, సైదులు యాదవ్, పడకంటి వెంకటేష్, ముత్యం, వెంకటేష్, రజక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## ఫుట్‌బాల్ క్రీడాకారుని సౌమ్యకు సన్మానం



క్రీడాకారుని సౌమ్యకు సన్మానం చేస్తున్న స్పోర్ట్స్ చైర్మన్, ఎమ్మెల్యే

**పెబ్బేరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలంలోనిపిజెపి ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో బుధవారం రోజు అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యకు స్పోర్ట్స్ చైర్మన్, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్రీడాకారిణి సౌమ్య మాట్లాడుతూ క్రీడల్లో రాణించడానికి క్రీడల్లో గెలుపొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని క్రీడలపై శ్రద్ధ ఉన్నవారికి సహాయ సహకారాలు అందించాలని అప్పుడే క్రీడకు తగిన గౌరవం దక్కుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నాకు సహాయం చేసే వారు లేక నేను ఎంత వెనకల పడ్డానో అని ఆవేదన వ్యక్తం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌన్సిలర్లు మండల కాంగ్రెస్ నాయకులు క్రీడాభిమానులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



విద్యుత్ శాఖ కార్యాలయానికి వినతి పత్రం అంటించిన దృశ్యం

**మక్తల్,సెప్టెంబరు11 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని కాచ్‌వవార్‌లో గత మూడు నెలలుగా విద్యుత్ సరఫరాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికి ఫలితం లేకపోయిందని గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు బుధవారం మక్తల్ పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాల యంలో ఏఈని కలిసేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా, కార్యాలయానికి తాళం వేసి ఉండడంతో రైతులు కార్యాలయ తలుపుకు వినతి పత్రాన్ని అంటించి తమ నిరసన తెలిపారు. ప్రతిరోజు విద్యుత్ సరఫరాలో వేళాపాళా లేకుండా కోతలు విధిస్తున్నారని, ఒక్కో సమయంలో ఒక్కో ప్రాంతంలో మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటుందని గ్రామస్తులు అన్నారు. దీంతో రాత్రి వేళల్లో దోమలు, విషసర్పాల సంచా రం ఎక్కువగా ఉంటుండడంతో ప్రమాదాలు రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు అన్నారు. అధి కారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని లేనిచో కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రెడ్డి, బొంబాయి రాములు, పి.మధు సూదన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, చిన్నరాయుడుగౌడ్, రఘుగౌడ్, నరెందర్ ముదిరాజ్, తిరుమలేష్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాల వద్ద బుధవారం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి నీళ్ళు పోశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యకక్షులు డివి చారి, సెక్రెటరీ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కోశాధికారి అంజన్‌ప్రసాద్, సీనియర్ సభ్యులు బి. కొండయ్య, రాజుల ఆశిరెడ్డి, చంద్రకాంత్‌గౌడ్, రమేష్‌రావు, అనుగొండ శ్రీనివాస్, గవినోళ్ల జైపాల్‌రెడ్డి, కర్నిస్వామి, అంబాదాస్, సత్య ఆంజనేయులు, సాయిజ్యోతి వెంకటయ్య, పాపిరెడ్డి, మామిళ్ల పృథ్వీరాజ్, మఠం వాదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి



విద్యుత్ ఘాతంతో మృతి చెందిన వ్యక్తులు

**మిడ్జిల్,సెప్టెంబరు11 ప్రభాతవార్త:** మండలంలోని బోయిన్‌పల్లి గ్రామ శివారులోని ఓ సోలార్ ప్లాంట్‌లో చోరీకి ప్రయత్నించి విద్యుత్ ఘాతంతో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వివరాల్లోకి వెళితే మంగళవవారం రాత్రి 9 గం.ల సమయంలో ఇద్దరు వ్యక్తులు దొంగతనం చేసే ఉద్దేశం తో అవుటర్ ఫినిషింగ్ కట్‌చేసి ఇన్నర్ ఫినిషింగ్ ఇంట్లో ఉన్న ఎలక్ట్రికల్ ఫినిషింగ్‌ని పట్టుకోగా షాక్ తగిలితే అక్కడక్కడ మరణించారని ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వారిని జడ్చర్ల ప్రభుత్వా సుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించగా ప్రాథవమిక విచారణలో రాగి తీగ దొంగిలించే ఉద్దేశంతో వచ్చారని తేలిందని వారన్నారు. వీరిని జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం పేరు బాల స్వామి వయసు 42 సంవత్సరాలు సుమారు అతని కుమారుడు జయరాజు 17 సంవత్సరాలు సుమారు నిర్ధారించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

## కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, ఎమ్మెల్యే



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ చైర్మన్, ఎమ్మెల్యే

**పెబ్బేరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని జడ్పీహెచ్ ఎస్ హైస్కూల్ ఎస్‌జిఎఫ్ అండర్ 14-17 కబడ్డీ,వాలీబాల్ పోటీలను ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి,వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ పెబ్బేరులో కచ్చితంగా ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి దానిలో అన్ని గేమ్స్ ఆడతట్లు సకల సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పెబ్బేర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ కు స్పోర్ట్స్ సంబంధించిన కిడ్స్ ఏమి లేవని పిడి అడిగి తెలుసుకున్న స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి తక్షణమే రేపు స్కూల్ కు కావలసిన క్రికెట్ వాలీబాల్ ఫుట్బాల్ రింగ్స్ పంపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. బుధవారం నిర్వహించిన అండర్ 14-17 కబడ్డీ పోటీలు విన్నర్స్‌గా పెబ్బేర్ మోడల్ స్కూల్, రన్నర్స్‌గా పెబ్బేర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ,గర్ల్స్ కబడ్డీ పోటీల్లో పెబ్బేర్ మోడల్ స్కూల్ విన్నరుగా,రన్నర్‌గా జడ్‌పిహెచ్ఎస్ రంగాపూర్,ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రావు మండల విద్యాధికారి జయరాములు మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ,ఈ గేమ్స్‌పీడీలు కుర్మయ్య, స్వాములు,కమలాకర్, శేఖర్,షబ్బీర్, ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మండల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దశదినకర్మలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**పెబ్బేరు సెప్టెంబర్11 ప్రభాతవార్త:** పెబ్బేరు మండల జనుంపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ గుండ్ల రాజావర్ధన్‌రెడ్డి అమ్మగారు మరణించారు. ఆ రోజు వివిధ కార్యక్రమాల నిమిత్తం రాలేకపోయినా బుధవారం గుండ్ల ప్రమీలమ్మ వారి దశదినకర్మకు హాజరైన డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు గుండ్ల ప్రమీలమ్మ ,చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రాగడ సానుభూతిని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, రాంపూర్ సహదేవుడు, జనుంపల్లి మహేశ్వర్ రెడ్డి,జనుంపల్లి సాయిరెడ్డి, మాధవరెడ్డి, తోమాలపల్లి కృపాకర్ రెడ్డి,జానంపేట మహేశ్వర్ రెడ్డి, దేవన్న యాదవ్,పాతపల్లి చంద్రశేఖర్, మిద్దె శ్రీకాంత్,జనంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి,రత్నాకర్ రెడ్డి, కృష్ణకుమార్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

◆ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ◆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే డా. కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం తాడూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అకస్మిక తనిఖీ చేసి ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి అక్కడే ఉండటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలు, సిబ్బంది కొరత, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవికుమార్‌నాయక్, స్థానిక వైద్యాధికారి సంతోష్, అభిరామ్, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

### కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డా.కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్11 ప్రభాతవార్త:** పేదింటిలో వివాహాలు జరిపించేందుకు తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వారి కష్టాలను తీర్చి ఆడబిడ్డలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ధరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను మంజూరు చేయడం జరుగు తుందని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని రైతు వేధిక కేంద్రంలో, తాడూర్ మండల కేంద్రంలోనిఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి పథకం ద్వారా వచ్చిన రూ॥లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి సూచించారు. తాడూర్ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 31 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, 5 మందికి షాది ముబారక్ చెక్కులను అందజేసినట్లు తహసీల్దార్ జె.కే.మోహన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, సింగిల్‌విండో చైర్మన్ రామచంద్రా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రోహిణి గోవర్ధన్‌రెడ్డి, తిమ్మాజిపేట పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, నాయకులు శ్రీనివాస, బహదూర్, మల్లయ్యగౌడ్, ఉస్మాన్, భాస్కర్‌రెడ్డి, రవూఫ్, ముబారక్,దేవస్వామి, నాగసాయిలు, రాఘవేందర్, మనోహర, శ్రీను తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి : జిల్లా ఇంఛార్జ్ డిఈఓ రవీందర్



విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్న జిల్లా ఇంఛార్జ్ డిఈఓ

**ఇటిక్యాల సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** సామార్థాలను పెంచాలని అలాగే ప్రతిరోజు పది నిమిషాల పాటు విద్యార్థులు చదువుపై ప్రాక్టీస్ చేయించాలని పాఠశాలలో పరిచేసే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని జిల్లా ఇన్చార్జి డిఈఒ రవీందర్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల పదవ బెటాలియన్ లోని పాఠశాల,కొండేరు, కోదండపురం ప్రభుత్వ పాఠశాలలను జిల్లా ఇన్చార్జి డిఈఒ రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రవల్లి చౌరస్తాలో గల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా అదే మండలంలోని పక్కా గ్రామాల ఉండి ఇద్దరు ఉపాధ్యాయులను 20 రోజుల కిందట డిప్యూటేషన్‌పై కేటాయించిన ఆ ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కాకపోవడంతో పాఠశాల ఇన్చార్జి హెచ్‌ఎం విజయ్ ఫోన్ ద్వారా హాజరుకాని ఉపాధ్యాయులతో డిఇఒ రవీందర్ వారితో మాట్లాడి డిప్యూటేషన్‌పై ఆదేశాలు ఉంటే కేటాయించిన పాఠశాలలో కూడా విధులు నిర్వహించాల్సి ఉందని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు విద్యార్థుల చదువులలో ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. పాటించాలని ఆదేశించారు.

## ప్రభుత్వ సహకారం ఉపయోగించుకుని మత్స్యకారులు ఎదగాలి

◆మత్స్యశాఖ డిఎఫ్ఓ రెహమాన్



మత్స్యశాఖ అధికారులతో పోటీ పరీక్షలలో పాల్గొన్న మత్స్యకారులు

**తెల్కపల్లి,సెప్టెంబరు11 ప్రభాతవార్త:** ప్రభుత్వం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అందిస్తున్న సహాయాన్ని ఉపయోగించుకుని మత్స్యకారులు ఎదగాలని నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖ డిఎఫ్ఓ రహమాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చేరుకున్న వారు ఇటీవల మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన సభ్యత్వం కోసం మండల కేంద్రానికి చెందిన 36 మంది మత్స్యకారులు దరఖాస్తులు చేసుకోగా వారికి మండలం కేంద్రంలోని పెద్ద చెరువులో బుధవారం నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. ఈత కొట్టడం, పాండి గుంజడం, వలవేయడం, తిప్పపై ఈదడం, వలఅల్లడం వంటి పోటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిషరీస్ ఇన్స్‌పెక్టర్ గంగారం, ఫీల్డ్‌మెన్ నరసింహులు, కోఆపరేటివ్‌అసిస్టెంట్ రిజిస్టర్‌సొసైటీ జిల్లా డైరెక్టర్ బి.సత్య నారాయణ,కార్యదర్శియాదయ్య,ఉపాధ్యక్షులు జంగసత్య నారాయణ, మత్స్య పారిశ్రామిక సంఘం కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి



సభ్యత్వ నమోదు కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

**వెల్దండ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేసి పెంచాలని సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు బండెల రాంచంద్రారెడ్డి, దుర్గప్రసాద్‌లు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు బండెల రాంచంద్రారెడ్డి, దుర్గప్రసాద్, రాఘవేందర్‌రెడ్డిలతో కలిసి నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సమగ్రంగా పార్టీ సభ్యత్వ నమోదు శాతాన్ని పెంచాలని,త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, నాయకులు శ్రీనివాసాచారి,జంగయ్యయాదవ్, బాలస్వామి, శశిధం రెడ్డి,పార్టీ నాయకులు, కార్యకర్తలు,పాతాధికారులు ఉన్నారు.



### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**అయిజ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** మండల పరిదిలోని టీటీ దొడ్డి, ఉత్తనూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా బుధావారం ఆయా గ్రామాలలో సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ నిరుపేద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సింగల్ బెంగాల్‌అధ్యక్షులు సంకాపురం రాముడు, మాజీ జెడ్పిటిసి చిన్న అనుమంతు, వావిలాల రంగారెడ్డి, కురువపల్లయ్య ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**కొత్తకోట సెప్టెంబర్11 ప్రభాతవార్త:** మదనపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు బుధవారం ఆ పాఠశాల 1982-83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు క్రీడా దుస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దిలేటి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మద్దిలేటి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన జగదీష్,కోటేశ్వర్, రావూర్, అమీర్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయబృందం మహేందర్‌గౌడ్, సుదర్శన్ రావు, పాండురంగయ్య, ప్రసాద్, కొండా వెంకటేశ్వర్లు, భారతమ్మ, శివ లీల, శిరీష తదితరులు పాల్గొన్నారు.



### వినూత్నంగా గణేష్ నిమజ్జనం



గణనాథున్ని ఎద్దుల బండిపై ఊరేగిస్తున్న దృశ్యం

**కృష్ణ,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** గుడెబల్లూరు గ్రామం పొలిమేరలో వెలసిన నరసప్ప తాత ఆలయంలో అయిదు రోజులుగా పూలందుకున్న గణేషున్ని గ్రామస్తులు నిమజ్జనం చేశారు. ఐదవ రోజు అన్నదానం నిర్వహించి అనంతరం గణనాథున్ని ఎద్దుల బండిపై గణేషున్ని ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు.

### తాగునీటికి శాశ్వత పరిష్కారం చూడండి

**పెబ్బేరు సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని శాఖపురం గ్రామంలో మంచి నీళ్ల గుండు బావి మరమ్మత్తు కోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి వినతిపత్రం ఎస్టిమేషన్ కాపీ ఇవ్వడం జరిగింది. ఈ సమస్యపై ఎమ్మెల్యే సానుకులంగా స్పందించడం జరిగింది. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రోజా కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పుట్ట తిరుపతయ్య ఎఈ దేవన్న సార్, బొడ్డుపల్లి శంకర్,సందకేశవులు,డా.రంజాన్,మేకల లక్ష్మణ్ యాదవ్,కురువ, కిషోర్, బలరాం,తదితరులు పాల్గొన్నారు.



అడిగిన వెంటనే అధికారులకు ఆదేశం ఇచ్చిన ఎమ్మెల్యే

### పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

**వెల్దండ, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జన కార్యక్రమాలను ముగించాలన్నారు. కార్యక్రమంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం



అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఇంఛార్జ్ మంత్రిని ఆహ్వానిస్తున్న దృశ్యం

**ఇటిక్యాల సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** ఈనెల 13 వ తేదీన అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ , వైస్ చైర్మన్ డైరెక్టర్లుగా అలంపూర్ చౌరస్తాలో గల మార్కెట్ యార్డులో జరిగే పదవి ప్రమాణ స్వీకారోత్సవ నిర్వహిస్తున్నారు. ఈ పదవి ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర శాఖ ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనరసింహ,తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావును, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవిని బుధవారం ఏఐసీసీ కార్యదర్శి చత్తీష్ ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారానికి హాజరుకావాలని అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డన్న వైస్ చైర్మన్ పచ్చర్ల కుమార్‌లు ఆహ్వానించారు. ఆహ్వానించిన వారిలో మాజీ ఆర్‌డి ఎస్ చైర్మన్ సీతారాం రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ ఆధ్యక్షులు నాగరాజు,జగన్ గౌడు, కొంకల యోగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



శ్రీసత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**లింగాల,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవా సంస్థ జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త మంద రమేష్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలో 55 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి బాబా 99వ పుట్టినరోజు సందర్భంగా ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సత్యసాయి సేవా సంస్థ జిల్లా విద్యా విభాగం సమన్వయకర్త మంద రమేష్ తెలిపారు. ఈ పోటీలోగెలుపొందిన విద్యార్థులకు పాంశాల డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన ప్రథమ విజేతకు స్వర్ణ పతాకం అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పురుషోత్తం, వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్య, భోజనం అందించాలి



**అయిజ సెప్టెంబర్ 11 ప్రభాతవార్త:** మండల పరది లోని టీటీ దొడ్డి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే విజయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాల లోని ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థుల సామరాధ్యలను ఎమ్మెల్యే పరీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే ఉపాధ్యాయులను ఉద్దేశించి విద్యార్థులకు నాణ్యామైన విద్యానుఅందించడంతో పాటుపౌష్టిక ఆహారంతో కూడిన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థు లతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### అవగాహన కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న డా. టీనా

**మహబూబ్‌నగర్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఎంవిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు స్త్రీ సంబంధిత ఆరోగ్య సమ స్యలు పరిష్కార మార్గాలుఅనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీనా సంతాన సాఫల్య కేంద్రం నిర్వహిస్తున్న డా. నితీష ప్రస్తుతం మహిళలు ఎక్కువగా ఎదు ర్కొంటున్న పిసిఒడి, సంతానలేమి, నెలసరి సమస్యలు మొదలగు అనేక అంశాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. పద్మావతి, మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డా.సరితా రాణి, డా.కె.సుభాషిణి, డా.విద్యారాణి, డా. ఎన్.సుభాషిణి, డా.స్వప్న, డా.స్వరూప, డా.మంజుల, డా.ఉమా, పి. భీమేశ్వరి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

### వైద్యారోగ్య శాఖ మంత్రికి వినతి

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు11 ప్రభాతవార్త :** నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి బుధవారం వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి నియోజకవర్గంలో వైద్య రంగంలో ఉన్న సమస్యల గురించి మాట్లాడుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే కోరిక మేరకు సమస్యలను పరిష్కరించేందుకుసానుకూలంగాస్పందించినట్లు సమాచారం.



జడ్చర్లలోని హనుమాన్ వీధిలో



గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి



సర్దార్‌వల్లభాయ్ పటేల్ నగర్‌లో..

# ఆకట్టుకున్న గణనాథుల ప్రతిమలు

## - వైభవంగా నవరాత్రి ఉత్సవాలు - మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు

జడ్చర్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్తః నవరాత్రి ఉత్సవాలు సంబురంగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆయా ఆకారాల్లో, వివిధ రంగుల్లో ఏర్పాటు చేసిన గణేశుడి ప్రతిమలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మండపాల వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, కోలాటాలు వేస్తూ, భజనలు చేస్తూ ఉత్సాహంగా ఉత్సవాలు జరుపుకొంటున్నారు. జడ్చర్లలో వేంకటేశ్వర కాలనీలో రూ3లక్షలకు గంగాపూర్‌కు చెందిన టంకశాల శ్రీనివాసులు దక్కించుకోగా, పద్మావతీ కాలనీ పార్క్‌లో రూ.2.25లక్షలకు గంట వంశీధర్ రెడ్డి గురువారం లడ్డూ వేలం దక్కించుకున్నారు. అదేవిధంగా పద్మావతి కాలనీలో వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి, నిర్వాహకులకు, అన్నదానం దాతలను నిర్వాహకులు సన్మానించారు.



మహబూబ్‌నగర్ మర్లులో గణపతిని దర్శించుకున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్



పద్మావతి కాలనీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



4వ వార్డులో రంగనాయకస్వామి గుట్ట ఆకారంలో ఏర్పాటు చేసిన గణపతి



పద్మావతి కాలనీలో దాచేపల్లి చంద్రయ్యను సన్మానిస్తున్న నిర్వాహకులు



మహబూబ్‌నగర్‌లో గణపతి మండపంలో భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీ



హనుమాన్ వీధిలో కోలాటం ఆడుతున్న మహిళలు



బాదేపల్లిలో..



జడ్చర్ల డిగ్రీ కళాశాల ఎదుట..



గంజి నటరాజ్ స్ట్రీట్‌లో..





పద్మావతీ కాలనీ, వేంకటేశ్వర కాలనీలో లడ్డూ దక్కించుకున్న వంశీధర్‌రెడ్డి, శ్రీనివాసులు



రాంమందిర్‌లో..



గౌరిశంకర్ కాలనీలో ఏర్పాటు చేసిన మట్టి గణేశ్



గౌరిశంకర్ కాలనీలో దేవి థియేటర్ వద్ద..

## విదేశాల్లో దేశ ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకోము

◆ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్న రాహుల్‌గాంధీ


◆ మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ ఫైర్

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** అమెరికాలో భారతదేశ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై స్పందించిన అరుణమ్మ ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. భారతదేశాన్ని విభజించేందుకు కుట్ర పన్నుతున్న శక్తులకు రాహుల్ గాంధీ అండగా నిలవడం సిగ్గుచేటని అన్నారు. భారతదేశంలో ఉంటూ ఇక్కడ స్వేచ్ఛ లేదని మాట్లాడడం సిగ్గు చేటన్నారు.ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడడం రాహుల్‌గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. అంతేకాదు జమ్ముకాశ్మీర్‌లో దేశ వ్యతిరేక విధానాలకు మద్దతిస్తూ ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఇలాంటి విదేశీ వేదికలపై భారతదేశానికి వ్యతిరేక ప్రకటనలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. రాహుల్ గాంధీ ప్రతిసారి మనదేశ భద్రతను, రక్షణ రంగాన్ని తక్కువ చేసి మాట్లాడడం అలవాటు అయిపోయిందన్నారు. తన వ్యాఖ్యలతో దేశ ప్రజల మనోభావాలను రాహుల్ దెబ్బతీస్తున్నారన్నారు. ఇప్పటికైనా బేషరతుగా ఈ దేశ ప్రజలకు రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డికె అరుణ గత పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఇలానే బిజెపి అధికారంలోకి వస్తే రిజర్వేషన్స్ తీసేస్తారంటూ తప్పుడు ప్రచారం చేశారని ఫైరయ్యారు.

## ఎలుకల మందు తాగి విద్యార్థిని మృతి

**మహ్మదాబాద్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** ఎలుకల మందు తాగి స్కూల్ విద్యార్థిని మృతి చెందిన ఘటన మహ్మదాబాద్ మండల పరిధిలోని దేశాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేశపల్లి గ్రామానికి చెందిన దొంగల చంద్రకళ భర్త కృష్ణయ్యల కూతురు దొంగల శ్రీలత (14) పుట్టినరోజు ఉన్నందున తన తల్లి చంద్రకళ ఇచ్చిన రెండు వందల రూపాయలతో చాక్లెట్లు కొనుక్కొని తన స్కూల్లో పంచింది. ఈ విషయంపై తన తండ్రి దొంగల కృష్ణయ్య చాక్లెట్లు పంచడానికి డబ్బులు ఎక్కడివని తన కూతుర్ని మందలించగా తన కూతురు శ్రీలత క్షణికావేశంలో ఏదో గుర్తు తెలియని ఎలుకల మందు తాగి ఇంట్లో పడి అక్కడే వాంతులు చేసుకుని పడి ఉండగా తన తల్లి వచ్చి ఏమైందని అడగగా తాను ఎలుకల మందు తాగాననితెలుపగా వెంటనే చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడచికిత్స పొందుతూబుధవారం ఉదయం 9.30 గం.లకు చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

## కృష్ణానదిలో కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం



**ఇటిక్యాల సెప్టెంబర్ 11ప్రభాతవార్త:** వినాయక చవితిపండుగను పురస్కరించుకొనిఊరురా యువత పిల్లలు పెద్దలు తేడా లేకుండా కుల మతాలకతీతంగా గణనాథులను మండపాలలో పూజకు కొలువు దీరించారు. భక్తిశ్రద్ధలతో భక్తులనుండి పూజలు అందుకున్న గణనాథులను బుధవారం 5వ రోజు కావడంతోపెద్ద సంఖ్యలో రాత్రంతా గణేష్ నిమజ్జనానికి యువత తరలివస్తారు. ఈ నేపథ్యంలో పెద్ద పెద్ద గణనాథులను క్రేన్ల ద్వారా గణనాథులను బీచుపల్లి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. మూడవరోజు నాలుగో రోజు చిన్న చిన్న గణనాథులనుబీచుపల్లి కృష్ణానదికి తరలించి నిమజ్జనం చేశారు.అలంపూర్‌సిఐ రవిబాబు ఆదేశాలతో స్థానికఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గజ ఈతగాళ్లు ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుంది. ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి అలాగే వైద్య శిబిరం కూడా నిర్వహించారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన కలెక్టర్

**చిన్నచింతకుంట,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రి జి. కృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందడంతో బుధవారం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపి జితేందర్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, ఆర్టీసి నేత అశ్వద్ధామరెడ్డి, వనపర్తి కాంగ్రెస్ నాయకులు ఆదిత్యరెడ్డిలు జి.కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు, అధికారులు, మీడియా ప్రతినిధులు కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులను సానుభూతి వ్యక్తం చేశారు.

## టీపీసీసీ నూతన అధ్యక్షుడిని కలిసిన భూత్పూర్ కాంగ్రెస్ నాయకులు

**భూత్పూర్,సెప్టెంబర్ 11,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను బుధవారం భూత్పూర్ మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.టీపీసీసీకి నూతనంగా అధ్యక్షుడిగా ఎన్నికైనందున మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందిం చారు. టీపీసీసీ నూతన అధ్యక్షుని కలిసినవారిలో భూత్పూర్‌కు చెందిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్‌తో పాటు ఇతర నాయకులున్నారు.

## వ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

◆ ఎంపిడిఓ రమణారావు

**చిన్నంబావి,సెప్టెంబరు 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో అధిక వర్షాల కారణంగా చుట్టు పంట పొలాల నీళ్లు గ్రామంలోకి చేరి వీధులన్ని అపరిశుభ్రంగా తయారయ్యాయని మురుగు నీటిని తొలగించి వ్యాధులు ప్రబలకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తుల కోరిక మేరకు బుధవారం మండల ఎంపిడిఓ రమణారావు, ఎంపిఓ రామస్వామి గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. వీధుల గుండా నిలిచిన వర్షపు నీటిని, పంట పొలాల నుంచి వచ్చే నీటిని పాటు కాలువ ద్వారా గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి నివేదిస్తామని ఎలాంటి వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, అలాగే దోమల ఫాగింగ్ సైతం చేయిస్తామని ఎంపిడిఓ అన్నారు. గ్రామంలో వీధుల గుండా నిలిచిన నీటిని వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త కళ్యాణ్‌రావు ఎంపిడిఓకు సూచించారు. దీంతో స్పందించిన అధికారులు రెండూ మూడు రోజులలో గ్రామంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం పాఠశాలలను సందర్శించి పరిశుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ధర్మేందర్, పురేందర్, గంగాధర్, సురేష్, శివ, మల్లయ్య పాల్గొన్నారు.



మురుగునీటిని తొలగించాలని అధికారులకు సూచిస్తున్న కళ్యాణ్‌రావు

## సమాజానికి ఆదర్శం ఉపాధ్యాయుడు

కెఎంఆర్ ట్రస్టు చైర్మన్ కొత్త కళ్యాణ్‌కుమార్‌రావు

**చిన్నంబావి,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** సమాజ స్థితిగతులను మార్చే అవకాశం ఒక ఉపాధ్యాయునికే ఉంటుందని ప్రతి ఉపాధ్యాయుడు విజ్ఞాన ఘని అని కెఎంఆర్ ట్రస్టు చైర్మన్ కొత్త కళ్యాణ్‌కుమార్ రావ్ అన్నారు. బుధవారం చిన్నంబావి మండల పరిధిలోని వెల్టూరు అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలను చూడడానికి విచ్చేసిన యాపర్ల జిహెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్ ఇటీవల రాష్ట్ర డిప్యూటీ సీఎం చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతో వెల్టూరు ప్రభుత్వ పాఠశాలను చూడడానికి విచ్చేసిన ఆయనను కొత్త కళ్యాణ్‌కుమార్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు యాపర్ల హెచ్‌ఎం శంకర్‌గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ నైపుణ్యం గల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో ఉంటారని వారి సమక్షంలో విద్యార్థులు దేశపౌరులుగా తీర్చిదిద్దడానికి ఎంతో అవకాశం ఉంటుందని ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్తును ఆకాంక్షిస్తాయని ఎందరో మేధావులు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న వారేనని కళ్యాణ్‌రావు అన్నారు. మండలంలో వెల్టూరు అమ్మ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పలు పాఠశాలలకు ఆదర్శంగా ఉందని అందుకే తాను పాఠశాలను చూడడానికి వచ్చారని శంకర్‌గౌడ్ అన్నారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం ఆనందం కలిగిందని అన్నారు. కార్యక్రమంలో మండల ఎంపిడిఓ రమణారావు,ఎంపియు రామస్వామి, ఉపాధ్యాయులు గణేష్, శివరాం,రజిని, ధరణి,వెంకటేష్, ఈశ్వర్‌రెడ్డి, గ్రామస్తులు ధర్మేందర్, పురెందర్, గంగాధర్, సురేష్, పెరుమాళ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాయకులు, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులు శంకర్‌గౌడ్ సన్మానిస్తున్న కళ్యాణ్‌రావు

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

◆ జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ సొంటె రాజయ్య

**జడ్చర్ల,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్య సూచించారు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నిత్యం జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పలవాటులో జరిగిన డ్రైనేజీ శుభ్రం చేసే పనులను, పిచ్చి మొక్కల తొలగింపు బండ్లను కమిషనర్ పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇండ్ల మధ్య నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశంఉన్నందున మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ రాజయ్య

## పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్పీ



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్పీ

**నారాయణపేట టౌన్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న, ఎస్‌హెచ్‌ఓ గది, ఫిర్యాదుదారుల గది, పోలీస్ ఇబ్బంది విశ్రాంతి గదిని పరిశీలించి పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు, ఫినిషింగ్ వర్క్ వేగవంతంగా, త్వరగా పూర్తి చేయాలని, పోలీస్ స్టేషన్‌లో ఉపయోగించే ఫర్నిచర్ ఇతర స్టేషనరీని నాణ్యమైనవి ఉపయోగించాలని అధికారులకు సూచించారు. రూరల్ పోలీస్ స్టేషన్ ప్రజలకు త్వరలో సమర్థవంతంగా సేవలందించడానికి నూతన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో నారాయణపేట సిఐ శివశంకర్, ఎస్సై రాముడు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## కాట్రేవుపల్లి రోడ్డు సమస్య పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

**మక్తల్,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** పట్టణం నుంచి కాట్రేవుపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇటుక బట్టీలను తక్షణమే తొలగించడంతో పాటు ఇటుక బట్టీల వల్ల పూర్తిగా దెబ్బతిని అస్తవ్యస్తంగా తయారైన బిటి రోడ్డును బిటి రోడ్డుగా మార్చి సమస్యను పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని మక్తల్, కాట్రేవుపల్లి, రుద్రసముద్రం, ఎర్నాగన్‌పల్లి దండు రైతులు అన్నారు. కాట్రేవుపల్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాల రైతులు చేపట్టిన దశల వారి పోరాటం బుధవారం ఊపందుకున్నది. ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని రైతులు ఆందోళన చేపట్టారు. ఇటుక బట్టీల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు అన్నారు. ఏ మాత్రం నిబంధనలు పాటించకుండా రోడ్డుకు ఇరువైపులా ఇటుక బట్టీలు ఏర్పాటు చేసిన యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు గత ఐదేళ్లుగా ఆ భూములకు సంబంధించి అక్రమంగా పొందిన రైతుబంధు డబ్బులను రికవరీ చేయాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ధర్నా విషయం తెలుసుకున్న మక్తల్ తహసిల్దార్ సతీష కుమార్,ఎస్సై వై.భాగ్యలక్ష్మిరెడ్డిలు దీక్షా శిబిరానికి చేరుకుని రైతులతో చర్చించారు.20 రోజుల్లోగా సమస్యను పూర్తిగా పర్కిరిస్తామని అప్పటివరకు రైతులు వేచి చూడాలని వారు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నాను తాత్కాలికంగా విరమించారు. కార్యక్రమంలోతిరుపతి నర్సింలు, మద్దిలేటి, వి.వెంకటేష్, తిరుపతి వెంకటేష్, కాట్రేవుపల్లి గ్రామస్తులు రాయప్ప, సత్యనారాయణరెడ్డి, ఎండి రసూల్, గోపాల్‌గౌడ్, మునిస్వామి, కుర్వ గడ్డం నరసప్ప, తిరుపతి మారెప్ప,బుడ్డ చెన్నప్ప, వడ్లరాజు, బి.కురుమయ్య, కేకే, బండారి శివరాజ్,తిరుపతి, గోపన్న, తిరుపతి, చిన్నలింగన్న, ప్యాటరాజు, గుర్జల్ నరసింమ, దండు నరసింహ, రుద్రసముద్రం చిన్న నరసింహ, డి. చంద్రశేఖర్‌లతో పాటు దాదాపు 200 మంది రైతులు పాల్గొన్నారు.

## చదువుతోనే భవిష్యత్తు

◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 11 ప్రభాతవార్త:** మీ భవిష్యత్తు కోసం మంచిగా చదవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తన సొంత నిధులతో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో అందిస్తున్న ఎంసెట్, నీట్ శిక్షణా తరగతులు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఎంసెట్, నీట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. లెక్చరర్స్ చెప్పింది విని శిక్షణ పొందుతున్న వారుఎంచుకున్న మెడికల్ లేదా ఇంజనీరింగ్‌లో మంచి ర్యాంకు సాధించి మహబూబ్‌నగర్‌కు పేరు తేవాలని ఆయన సూచించారు. అందరు కూడా ప్రతి రోజు తప్పకుండా తరగతులకు హాజరు కావాలని, ఆయన విద్యార్థులకు తెలిపారు. మీకు ఏ ఇబ్బందులు ఉన్నా వెంటనే మా దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. ఇక్కడ లెక్చరర్స్ మీకోసం ఎంతో శ్రద్ధ తీసుకుని కష్టపడుతున్నారని, వారి కష్టం, మీ శ్రమ కలసి మంచి ఫలితాలు రావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లెక్చరర్స్ నిర్వహించే ప్రతి పరీక్షలకు విధిగా విద్యార్థులు పాల్గొనాలని ఆయన చెప్పారు. వచ్చే రెండు సంవత్సరాలు మీ భవిష్యత్తు దృష్ట్యా చదువుపైన శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవంతాచారి, కౌసర్ జాహన్,లెక్చరర్స్ శశికళ,రవి,కవిత,సాదిక్,నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, బుద్ధారం సుధాకర్‌రెడ్డి, ఫయాజ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే